క్లుప్తంగా

13 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

దుమ్ముగూడెం: మండలంలోని అచ్చితాపురం గ్రామంలో ఈ నెల 13,14,15 తేదీల్లో దివంగత సోయం నవీన్‌కుమార్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోగా క్రీడాకారులు తమ ఏంట్రీలను నిర్వాహక కమిటీకి అందజేయాలని సూచించారు. మొదటి బహుమతిగా రూ.15,116, ద్వితీయ బహుమతిగా రూ.7,516, తృతీయ బహుమతిగా రూ.3,116, నాలుగవ బహుమతిగా రూ.2,516 అందజేయనున్నట్టు నిర్వాహక కమిటీ బాధ్యులు సోయం కామరాజు, కుర్సం రవి, గట్టుపల్లి సురేష్‌లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 6309358124, 7569948613 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్డీఓను కలిసిన రేషన్ డీలర్లు



ఆర్‌డీఓకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రేషన్ డీలర్లు

అశ్వాపురం: రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో అశ్వాపురం మండల రేషన్ డీలర్లు గురువారం భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు ఆర్డీఓ మంగీలాల్‌ను శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు ప్రభాకర్‌రావు, భద్రయ్య, అంజయ్య పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి

అశ్వారావుపేటరూరల్: తరగతి గదిలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.ప్రసాద్‌రావు, కార్యదర్శి పద్దం రాము అన్నారు. గురువారం మండలంలోని తిరుమలకుంట గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలో మామిళ్లవారిగూడెం, నారాయణపురం కాంప్లెక్స్‌ల ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు సులువైన పద్ధతిలో, బోధన సామగ్రిను వినియోగిస్తూ పాఠాలను బోధించాలని సూచించారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాన్ని బోధించారు. సమావేశానికి ఉపాధ్యాయులు, సీఆర్పీ భూక్యా మల్లేష్ నాయక్ హాజరయ్యారు.

విజయమే లక్ష్యం

ములకలపల్లి: రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదామని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ మండలస్థాయి సమావేశంలో పాల్గొన్న మెచ్చా మాట్లాడారు. గెలుపు, ఓటములు సహజమని అన్నారు. లోపాలను సరిదిద్దుకొని, సమిష్టిగా పనిచేయాలని సూచించారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, గ్రామశాఖ అధ్యక్షుడు బిక్కుమళ్ల సుధాకర్, ఎంపీపీ మట్ల నాగమణి, జెడ్పీటీసీ సున్నం నాగమణి, నియోజకవర్గ నాయకురాలు ఒగ్గెల పూజ, సర్పంచ్‌లు గడ్డం భవాని, బైటి రాజేశ్, వాడె నాగరాజు, నాయకులు పుష్పాల చందర్‌రావు, తాండ్ర రాంబాబు, ఇనుగంటి రాము, పాలకుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

చర్ల: మండలంలోని సింగసముద్రంలోని జీఎస్ఎస్ చైల్డ్ కేర్ సెటర్‌లోని విద్యార్థులకు ఖమ్మానికి చెందిన గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.1 లక్షల విలువ చేసే దుప్పట్లు, స్వెట్టర్లు, దుస్తులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గురువారం గ్రామంలోని చైల్డ్‌కేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ అనంతరామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు చేతుల మీదుగా 120 మంది చిన్నారులకు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై స్పష్టతనివ్వాలి

బూర్గంపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలనుకున్న ఆరు గ్యారంటీ పథకాలపై సరైన మార్గదర్శకాలు విడుదల చేసి ప్రజలకు స్పష్టతనివ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రజా పాలన గ్రామసభల పేరిట ప్రభుత్వం హడావుడి చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందని ఆరోపించారు. అందరు ప్రజాపాలనలో దరఖాస్తులు పెట్టుకోవాలని తొలుత చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు పథకాలు అందేవారు అవసరం లేదనిచెప్పటం సరైన విధానం కాదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సరైన విధివిధానాలతో మార్గదర్శకాలు విడుదల చేసి ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

భారంగా మధ్యాహ్న భోజనం

- పెరిగిన ధరలతో నిర్వాహకులకు తప్పని తిప్పలు
- పెండింగ్ బిల్లులతో ఆర్థికంగా ఇబ్బందులు
- గౌరవ వేతనాలు అందక అగచాట్లు



బూర్గంపాడులో మధ్యాహ్న భోజనం పెడుతున్న నిర్వాహకులు

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి కడుపు నింపుతున్న నిర్వాహకులు.. తాము మాత్రం పస్తులుండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులు అందక ఒకవైపు, పెరిగిన నిత్యావసర ధరలతో మరోవైపు ఆర్థికంగా అతలాకుతలం చేస్తున్నాయి. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ మరింత భారంగా మారింది. ప్రభుత్వం వారికి ఇస్తామని చెప్పిన గౌరవ వేతనం కూడా నెలల తరబడి అందకపోవటంతో వారు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో వారు వండి పెట్టుడు మావల్ల కాదంటున్నారు.

పెరిగిన ఖర్చులు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వమే ఏళ్ల తరబడి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదివే ప్రతి విద్యార్థికీ రోజుకు రూ.5.45 మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం చెల్లిస్తుంది. 6 నుంచి 8వ తరగతి చదివే పిల్లలకు రూ.8.15 చెల్లిస్తుంది. 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.10.65 చెల్లిస్తుంది. మధ్యాహ్న భోజన పథకంలో బియ్యం ప్రభుత్వమే నిర్వాహకులకు ఉచితంగా సరఫరా చేస్తుంది. కూరగాయలు, నూనెలు, పప్పులు, వంటచెరుకు, గ్యాస్ ఇతరత్రా అవసరాల కోసం ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది. వారంలో మూడురోజులు విద్యార్థులకు గుడ్లు కచ్చితంగా ఇవ్వాలి. ఇందుకోసం ప్రభుత్వం గుడ్డుకు రూ.5ల చొప్పున వారానికి రూ.15 చెల్లిస్తుంది. అయితే ప్రస్తుతం గుడ్డు ధర రూ.7లకు పెరిగింది. దీంతో నిర్వహకులకు వారానికి ఒక విద్యార్థికి రూ.6 అదనపు భారం పడుతుంది. 9, 10వ తరగతి విద్యార్థులకు కూడా వారానికి మూడురోజులు గుడ్లు ఇవ్వాలి. అయితే ఈ విద్యార్థులకు ఇచ్చే గుడ్లకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వదు. ఈ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి రూ.10.65 చెల్లిచడంతో.. ఆ ధరలోనే గుడ్లను నిర్వహకులు అందించాలి. ప్రస్తుతం కూరగాయలు, పప్పులు, నూనెల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ఒక్కొ విద్యార్థి భోజనానికి రోజుకు తక్కువలో తక్కువగా రూ.17 నుంచి 20 ఖర్చవుతుంది. ఇలా ప్రభుత్వం చెల్లిస్తున్నదానికి అవుతున్న ఖర్చుకు పొంతన లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వహకులు అప్పుల పాలవుతున్నారు.

అందని బిల్లులు..

ప్రభుత్వం చెల్లించే ఆ కొంచెం డబ్బుకు సంబంధించి కూడా బిల్లులు సకాలంలో కావడం లేదు. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు ఒక్కసారి మాత్రమే మధ్యాహ్న భోజన పథకం నిర్వహకులకు బిల్లులు అందాయి. గత ఆరు నెలలుగా బిల్లులు అందక నిర్వహకులు కిరాణా దుకాణాలలో, కూరగాయల దుకాణాలలో అందినకాడికి అప్పులు చేశారు. ఇప్పుడు దుకాణాదారులు కూడా వీరికి అప్పులు ఇచ్చే పరిస్థితులు లేదు. పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే మధ్యాహ్న భోజనం పెట్టలేమని నిర్వహకులు తేల్చిచెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే బిల్లులు గుడ్లకు కూడా సరిపోవటం లేదని, ఆ కొంచెం కూడా బిల్లులు కావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశిస్తున్న ప్రభుత్వం.. అదే స్థాయిలో విద్యార్థికి వెచ్చించాలని అంటున్నారు.

గౌరవ వేతనం ఎటుపాయే..

మధ్యాహ్న భోజన నిర్వహకులకు ప్రభుత్వం అందిస్తామని చెప్పిన గౌరవ వేతనాలు కూడా ఏడాది ఒక సారి కూడా అందటం లేదు. ఒక్కొక్కరికి నెలకు రూ.3 వేల గౌరవ వేతనం ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వం.. 8 నెలల వ్యవధిలో ఒక్కసారి మాత్రమే రూ.8వేలు తమ ఖాతాలలో వేశారని నిర్వహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకం సక్రమంగా అమలు చేయాలంటే పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచి ప్రతి నెలా బిల్లులు చెల్లించాలని నిర్వహకులు డిమాండ్ చేస్తున్నారు. తమ శ్రమను గుర్తించి నెలకు రూ.10 వేల గౌరవవేతనమివ్వాలని కోరుతున్నారు.

రూ.60 వేలు అప్పు చేశాం



సరుకులు, కూరగాయల కోసం నాలుగు నెలలుగా అరవై వేల అప్పు చేశాం. దుకాణాదారులు అప్పులు చెల్లించకుంటే సరకులు ఇవ్వలేమంటున్నారు. గుడ్డుకు ప్రభుత్వం రూ.5లు ఇస్తుంది. ఇప్పుడు గుడ్డు రూ.7లు పడుతుంది. ఒక్క గుడ్డుపైనే రోజుకు రూ.2 నష్టపోతున్నాం.

– వెంకటలక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

ఆరు నెలలుగా బిల్లులు లేవు



ఆరునెలలుగా బిల్లులు రావటం లేదు. సరకుల కొనడానికి అప్పులు చేస్తున్నాం. అప్పులకు వడ్డీ పెరుగుతోంది. మా కష్టానికి ఫలితం దక్కకపోగా చేతి నుంచి ఖర్చు పెట్టాల్సి వస్తుంది. గౌరవ వేతనం కూడా నెలల గడిచినా అందడం లేదు. ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

– పుట్టి లక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

కూలి పనులకు పొమ్మంటున్నారు..



మధ్యాహ్న భోజనం వండటానికి వద్దని, కూలి పనులకు వెళ్లమని ఇంట్లో వాళ్లు గొడవ చేస్తున్నారు. రోజు బడికి వెళ్లి భోజనం వండి పెట్టిన కూలి కూడా గిట్టడం లేదు. నెలల తరబడి బిల్లులు అందక అప్పుల పాలవుతున్నాం. అప్పులు పెరిగిపోతుండటంతో వంట చేయలేకపోతున్నాం.

– ఎం.సుజాత, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

గోడ పత్రికలు ఆవిష్కరణ



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, జనవిజ్ఞాన వేదిక సభ్యులు

దమ్మపేట: విద్యార్థులకు నిర్వహించనున్న చెకుముకి పోటీల గోడ పత్రికలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారిణి కీసర లక్ష్మి చేతులమీదుగా వీటిని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ.. చెకుముకి పోటీల పేరిట 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు సైన్స్ పోటీ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలను పాఠశాల స్థాయిలో ఈ నెల 19న, మండల స్థాయిలో ఈ నెల 27న, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 3న పరీక్షలు నిర్వహించనున్నామని వెల్లడించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఉమామహేశ్వరరావు, రమేష్, అశోక్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



భద్రాచలంటౌన్: అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ములకలపల్లి: మండలకేంద్రంలో సరస్వతి శిశు మందిర్ ఆవాస విద్యాలయం చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు రాయల కేథారేశ్వరావు కుమారుడి జన్మదినం సందర్భంగా పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ప్రధానాచార్యులు జగన్, క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, సభ్యులు కుంజా రాజారావు, తానం శ్రీనివాసరావు, మడకం మణికంఠ, కోంద్రు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో నూతన సంవత్సర మొదటి గురువారం పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత దివంగత మాగంటి సూర్యం జ్ఞాపకార్థం కుమారులు ప్రసాద్, రమేష్ బాబులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఏటీపీ క్యాలెండర్ ఆవిష్కరణ

మణుగూరురూరల్: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీమల సత్యం, జిల్లా ఆడిటర్ కోరెం శ్రీను, జిల్లా కార్యదర్శి పాయం రంగారావు, జిల్లా ఆర్గనై జింగ్ కార్యదర్శి సింగా రవిబాబు, డివిజన్ అధ్యక్షుడు పూనెం బాలరాజు, మండల అధ్యక్షుడు పద్దం సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పూనెం రామకృష్ణ, పాయం సూర్యనారాయణ, వజ్జా శ్రీకాంత్, మండల మహిళా కార్యదర్శి సూర్థపాక యశోద, ఏనుగు రమాదేవి, సున్నం శ్రీదేవి, కొమరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు' లక్ష్యాన్ని సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి ప్రసాద్‌రావు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ అమలు చేస్తున్న తొలిమెట్టు కార్యక్రమ లక్ష్యాన్ని సాధించాలని ఆ కార్యక్రమం మండల నోడల్ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. గురువారం అశ్వారావుపేటలోని చిన్నంశెట్టి బజార్, దొంతికుంటలోని ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమ అమలు తీరు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. విద్యార్థుల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేయడంతోపాటు, విద్యార్థుల నోట్ బుక్స్‌ను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిత, సీఆర్పీ ప్రభాకరాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థినుల ఎంపిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మారుతీ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న 47 మంది విద్యార్థునులు హైదరాబాద్‌లోని ఒమేగ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్, ఒమేగ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో ఉద్యోగాలు సాధించినట్లు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, సుబ్బారాజులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో నర్సింగ్ కోర్సు పూర్తి చేసుకుని క్యాంపస్ సెలక్షన్ ద్వారా ఉద్యోగాలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. భద్రాచలం ఏజన్సీలోని పేద విద్యార్థునీలకు ఉద్యోగ అవకాశం కల్పించిన ఒమేగ హాస్పటల్స్ యాజమాన్యానానికి వారు ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న నెహ్రూకప్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న సీఐ నాగరాజురెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న నెహ్రూకప్ అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు ఫైనల్‌కు దగ్గర పడుతుండడంతో ఆసక్తిగా సాగుతున్నాయి. గురువారం జరిగిన రెండు మ్యాచ్‌లు చివరి బంతివరకు సాగడంలో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఉదయం మ్యాచ్ చేజింగ్ లెవెన్ పాల్వంచ, మాస్టర్స్ లెవెన్ ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చేజింగ్ చేసిన పాల్వంచ జట్టు 153 పరుగులు చేసి ఓటమి పాలయింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో కుంట స్పోర్ట్స్ క్లబ్ (ఛత్తీస్‌గఢ్), చందు లెవెన్ భద్రాచలం జట్ల మధ్య హోరాహోరీ పోరుతో మ్యాచ్ చందు లెలెన్ జట్టు ఒక్క పరుగు తేడాతో గెలుపొందింది. రెండు మ్యాచ్‌లలో ప్రతిభ కనభరిచిన క్రీడాకారులకు నిర్వహకులు మాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నాగరాజురెడ్డి, పసుపులేటి రామకృష్ణ, తోటమళ్ల బాలయోగి, సదానందం, శ్రీనివాస్, తిరుమలరావు, పాషా, సీతారామరాజు, శేషుబాబు, సత్తిపండు, గోపి తదితరులు పాల్గొన్నారు.

సావనీర్‌ను ఆవిష్కరించిన మెజిస్ట్రేట్



ఆవిష్కరిస్తున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) ఆధ్వర్యంలో ముద్రించిన కానిస్టిట్యూషన్ అండ్ వియ్ ద పీపుల్–సావనీర్ పుస్తకాన్ని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు గురువారం ఆవిష్కరించారు. ఐలు నూతన సంవత్సర ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలు ప్రతినిధులు మాట్లాడుతూ.. దేశంలోని ఉన్నత, రాష్ట్రంలోని న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆలోచనల నుంచి సావనీర్ పుస్తకం రూపుదిద్దుకుందన్నారు. అనంతరం మెజిస్ట్రేట్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క న్యాయవాది ఈ సావనీర్ పుస్తకాన్ని చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ఐలు మండల అధ్యక్షుడు పి.భాస్కర్, న్యాయవాదులు కిషన్‌రావు, కె.నరసింహారావు, విజయ్‌రావు, సర్వేశ్వరరావు, పద్మావతి, సంధ్య, వాసవి పాల్గొన్నారు.

రామానుజవరాన్ని అభివృద్ధి చేస్తా



మణుగూరురూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: రామానుజవరం గ్రామపంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రామానుజవరం పంచాయతీ కొండాయిగూడెం ముత్యాలమ్మగుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీటీపీఎస్, సింగరేణి సీఎస్ఆర్ నిధులను వెచ్చించి రామానుజవరం పంచాయతీలో ప్రధాన వీధుల వెంట సైడ్ డ్రైయిన్లు నిర్మిస్తామని, అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. బీటీపీఎస్ రైల్వే నిర్వాసితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయంను పంచాయతీ ప్రజాప్రతినిధులు, ప్రజలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య, వైస్ ఎంపీపీ కేవీ రావు, సర్పంచ్ బాడిశ సతీష్, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంట ఏరియాకు చెందిన ధరావత్ బీబీలాల్ గురువారం అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ప్రజాప్రతినిదులు, కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలున్నారు.

సీఆర్పీ మృతదేహానికి నివాళి

అశ్వాపురం: మండలంలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలో యున్న బండ్లవారిగుంపులో అనారోగ్యంతో మృతి చెందిన సీఆర్పీ బండ్ల నర్సింహారావు మృతదేహాన్ని గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించారు. మృతదేహానికి నివాళుర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. కుటుంబాన్ని అన్ని విధాలా కుటుంబాన్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ముత్తునేని సుజాత, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శ్రీరామ అక్షింతలు ఊరేగింపు



చంద్రుగొండ: మద్దుకూరులో అక్షింతల శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో అయోధ్య రామ మందిరం ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గురువారం ఊరేగించారు. లక్ష్మీనగరం గ్రామంలోని దాసాంజనేయ స్వామి దేవాలయం నుంచి అక్షింతలను పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పిన్నింటి రాజశేఖర్–కమల దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ శిరపు వీర రాఘవ రెడ్డి, గుడ్ల తాతారావు, అంజి, ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు, మండల టీటీడీ ప్రచారక్ పిలకా నాగేంద్రరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామంలో గురువారం అయోధ్యలోని బలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటికీ అక్షింతలు పంపిణీ చేశారు. డప్పు వాయిద్యాలు, మహిళల నృత్యాల నడుమ శోభయాత్ర సాగింది. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు కుక్కడపు రామారావు, నల్లమోతు రఘుపతిరావు, వెంకటేశ్వరస్వామి, రామాలయ ఆలయాల చైర్మెన్లు నల్లమోతు సత్యనారాయణ, నల్లమోతు రవి, పత్తిపాక వెంకన్న పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరణ



బూర్గంపాడు: సారపాకలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

ఆరు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తుల స్వీకరణ గురువారం కొనసాగింది. ప్రజాపాలన కార్యక్రమానికి ఆయా ప్రాంతాల వాసులు చేరుకుని తమ దరఖాస్తులను అధికారులకు అందజేశారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు తనిఖీలు నిర్వహించి తీరుతెన్నులను పరిశీలించారు. అన్నిచోట్ల గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: నర్సాపురంలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



ములకలపల్లి: దరఖాస్తుల రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



అన్నపురెడ్డిపల్లి: దరఖాస్తుల స్వీకరణ వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి అనసూయ



అశ్వారావుపేటరూరల్: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి

ఎమ్మెల్యేకు ఎంపీపీ వినతి

అశ్వాపురం: మండలంలోని గొల్లగూడెం గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలపై ఎంపీపీ ముత్తునేని సుజాత గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు.

మణుగూరులోని ఎమ్మెల్యే కాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ.. రాజీవ్‌నగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఇరిగేషన్‌శాఖ ఆధీనంలో ఉన్న 18 భవనాలను గొల్లగూడెంలోని దళితవాడలో ఉన్న నిరుపేదలకు కేటాయించాలని, సర్వాయిగూడెంబంజర రోడ్డు, హెలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. గొల్లగూడెం నుంచి గొందిగూడెంకు నిర్మాణంలో ఉన్న లింకురోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రంలో ఎంపీపీ కోరారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బొబ్బాల నాగేశ్వరావు, పాడియం అనిల్‌కుమార్, కన్నం నాగార్జున్, బొబ్బాల వీరన్న, ఇల్లుటూరి మహేష్, ఏర్పుల దేవస్వామి, ఏర్పుల శంకర్, ఏర్పుల నరేష్, కనిగంటి రాంబాబు తదితరులన్నారు.